1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

ఆదివారం | జనవరి 14, 2024 | www.navatelangana.com

రిటైర్డ్ టీచర్ రామారావుకు ఘన నివాళి

కాగజ్‌నగర్ రూరల్ : కాగజ్‌నగర్ పట్టణం బాలాజీనగర్ చెందిన రిటైర్డ్ టీచర్ తాళ్లపల్లి రామారావు అనారోగ్యంతో శనివారం వేకువజామున మరణించారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు రామారావు పార్థివదేహానికి నివాళ్లర్పించారు. ఉపాధ్యాయ వృత్తిలో రామారావు మారుమూల గ్రామాల్లో నిబద్ధతతో పనిచేసి ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, జయదేవ్, శివప్రసాద్, పూర్ణచందర్‌రావు, నారాయణ, మురళీధర్‌రావు, ఏఎస్ఆర్ మూర్తితోపాటు పలువురు రామారావు కుటుంబీకులను పరామర్శించి సంతాపం తెలిపారు.



ఘనంగా లయన్స్ క్లబ్ ఫౌండర్ జన్మదిన వేడుకలు

ఆసిఫాబాద్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ జన్మదిన వేడుకలు ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా(తారిక్) అధ్యక్షతన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ అనేక దేశాలకు క్లబ్ సేవలు విస్తరించడానికి జోన్స్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ఆసిఫాబాద్ క్లబ్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవలు విస్తరించనున్నట్టు తెలిపారు. అనంతరం ఎంజెఎఫ్ సభ్యులుగా చేరిన ఆంజనేయులు, వెంకటరమణారెడ్డి, నాంపల్లి శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ సంజయ్‌కుమార్, జెడ్సి కోట వెంకన్న, సభ్యులు రావుల వినాయక్‌రావు, వేణుగోపాల్, ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ నర్సయ్య, పుల్లూరి శంకర్ పాల్గొన్నారు.



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ - సిర్పూర్(టి)

రౌడీ, సస్పెక్ట్, హిస్టరీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకొని జనావాసాల్లో కలిసిమెలిసి ఉండాలని ఎస్ఐ దీకొండ రమేష్ అన్నారు. శనివారం ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో వేరువేరు కేసుల్లో సస్పెక్ట్, హిస్టరీ, రౌడీ షీటర్లు ఉన్నవారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ తమ ప్రవర్తనను మార్చుకోవాలని, ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా పెట్టామని, ఎక్కడైనా గొడవలకు దిగితే ఉపేక్షించేదిలేదని పేర్కొన్నారు. నేర ప్రవృత్తిని వీడి మంచి ప్రవర్తనతో కుటుంబాలతో కలిసి జీవించాలని, నేర ప్రవృత్తిని వీడకపోతే పీడీయాక్టు చట్టాన్ని నమోదు చేస్తామని పేర్కొన్నారు. ప్రజా జీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని, అనవసరమైన గొడవల జోలికి పోకుండా జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు.

జగదాంబ జాతర క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ - జైనూర్

లింగాపూర్ మండలంలో ప్రతి ఏడాది నిర్వహించే జగదాంబ దేవీ మహాజాతర సందర్భంగా శనివారం క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రాథోడ్ వినోద్ మాట్లాడుతూ పలువురు క్రీడాకారులు క్రికెట్ ఆడి ముందుండాలనే ఉద్దేశంతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు స్నేహాభావంతో ఆటల పోటీల్లో పాల్గొని బహుమతులు పొందాలన్నారు. జాతర సందర్భంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా క్రీడాకారులు ఒకరినొకరు గౌరవించాలని, క్రీడల్లో గెలుపోటములు సహజమని తెలిపారు. ఈ పోటీలో మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి రూ.15 వేలతో పాటు లిటిల్ స్టార్ ఇంగ్లీష్ మీడియం యాజమాన్యం తరపున మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా బహుమతులు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మెస్రం జంగు పటేల్, జాదవ్ కైలాష్, జాదవ్ గణపతి నాయక్, వినోద్, రవీందర్, మనోజ్, ప్రకాష్, రవీందర్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ అధ్యక్షున్ని సన్మానించిన ఏఎంసీ చైర్మన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ వాసవీ క్లబ్ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కొల్లిపాక శంకర్‌ను శనివారం సింగల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్ తనకి మంచి మిత్రుడని, క్లబ్ అధ్యక్షునిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాల అధిరోహించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెడ్మ బాధు పటేల్, కుమురం దేవ్‌రావ్, గేడేకర్ అన్నజి, శంకర్ పాల్గొన్నారు.

ఆదివాసీ ఆణిముత్యానికి సన్మానం



కెరమెరి: మండలంలోని హట్టి గ్రామానికి చెందిన మడావి సాక్రుబాయి, బొజ్జిరావు దంపతుల కుమారుడు నగేష్‌ను పెందూర్ మోతీరాం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. నగేష్ ఇంటర్ ఆదిలాబాద్ గురుకులంలో 2019లో పూర్తి చేసి చేశాడు. జేఈఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి పాట్నా(నిట్) నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఫిజిక్స్ విభాగంలో సీటు సంపాదించాడు. ఈ సందర్భంగా ఎంపీపీ పెందూర్ మోతీరాం, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మడావి భరత్ భూషణ్, మండల అధ్యక్షులు సెడ్మకి తుకారాం, ఆడ ఆనంద్‌రావు పాల్గొన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సిర్పూర్(టి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందాలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ దీకొండ రమేష్ హెచ్చరించారు. శనివారం మండలంలోని భూపాలపట్నం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, పేకాట వల్ల జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. సంక్రాంతి పండుగ వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని, గ్రామంలో కోడి పందాలు, ఇతర జూదాలు నిర్వహించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైన కోడి పందాలు, పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైన జూదం, కోడి పందాలు ఆడుతున్నట్టు తెలిస్తే 8712670544 లేదా 100 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు.

వైద్యులు ఎప్పడొచ్చేనో..?

- సూపర్ స్పెషాలిటీలో అందని నాణ్యమైన వైద్యం
- ప్రారంభించిన కొద్ది కాలానికే నిలిచిపోతున్న సేవలు
- ఏండ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో లభించని వైనం
- కేవలం రెండు విభాగాలకే పరిమితమైన వైద్యం

నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మెరుగైన సేవలు కరువయ్యాయి. ఉమ్మడి జిల్లా పేదలకు అందుబాటులో ఉంటుందని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రూ.150కోట్లతో నిర్మించిన ఈ ఆస్పత్రి కేవలం అలంకార ప్రాయంగా మారుతోంది. ఏడంతస్తుల మేడలాగా..చూడముచ్చటైన భవనం నిర్మించినా.. మేడిపండు చందంలా మారుతోంది. బయటి నుంచి చూస్తే అందమైనా భవనం కనిపిస్తున్నా లోపల మాత్రం అందుకనుగుణంగా వైద్య సేవలు లభించకపోవడం విమర్శలకు తావిస్తోంది. 2011లో నిర్మాణం ప్రారంభించి 2022లో అధికారికంగా సేవలు ప్రారంభించారు. తొలుత నాలుగు విభాగాలు మాత్రమే ప్రారంభం కాగా.. అనతికాలంలోనే అవి కూడా ఆగిపోయాయి. ప్రస్తుతం రెండు విభాగాల్లో మాత్రమే సేవలు లభించగా.. మిగితా ఆరు విభాగాల్లో ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించకపోవడం మూలంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి సేవలు లభించడం లేదనే ఆరోపణలున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ గిరిజనులు, అత్యంత నిరుపేదలు అధికంగా నివసిస్తుంటారు. ఇలాంటి జిల్లాలో రిమ్స్‌తో పాటు జిల్లా కేంద్ర ఆస్పత్రులు ఉన్నా..అన్ని విభాగాల్లో సేవలు లభించడం లేదు. కొన్ని కీలకమైన వైద్య సేవలు లభించకపోవడం మూలంగా జిల్లావాసులు హైదరాబాద్, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు వెళు న్నారు. ఈ దుస్థితిని తప్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రూ.150కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించారు. కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, ఆంకాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, నెఫ్రాలజీ, కార్డియోతెరసిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ తదితర విభాగాల్లో సేవలు అందించాలని భావించాయి. ఈ సేవలు అందుబాటులోకి వస్తుండటంతో జిల్లావాసులు చాలా సంతోషించారు. కానీ ప్రారంభించిన మూడు నెలలకే సేవలు నిలిచిపోతుండటంతో ప్రజల్లో తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. గత ప్రభుత్వం ఈ ఆస్పత్రిలో ఖాళీలు భర్తీ చేసి పూర్తిస్థాయి వైద్యం అందిస్తామని పలుమార్లు చెప్పినప్పటికీ.. కేవలం మాటలకే పరిమితమైంది తప్పితే సేవలు ప్రారంభం కాలేదు. ఎనిమిది సేవల్లో ప్రస్తుతం యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ సేవలు మాత్రమే లభిస్తున్నాయి. మిగితా ఆరు విభాగాలు ఇప్పటికీ ప్రారంభం కావడం లేదు.

కలగానే మిగిలిన హామీ..!

జిల్లాకు వచ్చిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా సూపర్ స్పెషాలిటీలో పూర్తిస్థాయి వైద్యులను నియమించి అన్ని విభాగాల్లో సేవలు లభించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కిందటేడాది మేలో వైద్య విద్య సంచాలకుడు సైతం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా మరో మూడు నెలల్లోనే వైద్యులను నియమిస్తామని భరోసా ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు నిపుణులైన వైద్యులు ఎవరూ రాలేకపోయారు. వైద్య కళాశాలల్లో వివిధ విభాగాల్లో పీజీ పూర్తిచేసిన విద్యార్థులు(డాక్టర్లు) ఏడాది పాటు అప్రెంటిషిప్ కింద ఏడాది పాటు ఆస్పత్రుల్లో సేవలందించేలా ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. ఈ నిబంధన కింద సూపర్ స్పెషాలిటీకి కూడా ఆయా విభాగాల్లో పని చేసేందుకు వైద్యులు వస్తారని అందరూ భావించారు. కానీ నిబంధనలు గాలికొదిలేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క ప్రభుత్వం అందించే వేతనానికి సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఇక్కడకు వచ్చేందుకు అయిష్టత చూపుతున్నట్లు తెలిసింది. తక్కువ జీతం రావడంతోనే వచ్చిన వారు కూడా కొన్ని నెలలకే వెళ్లిపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కనీసం ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి పూర్తిస్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని జిల్లావాసులు కోరుతున్నారు.

కుమురంభీం స్ఫూర్తితో

రాజ్యాధికారం సాధించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- అంబగట్టలో కుమురం భీం విగ్రహావిష్కరణ

నవతెలంగాణ -చింతలమానేపల్లి

జల్ జంగల్ జమీన్ కోసం తుపాకీ చేతపట్టి నిజాం సైన్యంతో పోరాడి అశువులు బాసిన ఆదివాసీ యోధుడు కుమురం భీం స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని సాధించాకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని అంబగట్టలో ఆదివాసీ సంఘాలతో కలిసి పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసులు నివసించే ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదానీ, అంబానీలు అక్రమంగా మైనింగ్ కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసులకు స్థిరనివాసం కూడా లేని దుస్థితిలో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పోడు పట్టాలు ఇవ్వడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. భీం పోరాడి సాధించిన హక్కులను, చట్టాలను ఆధిపత్య పాలకులు తుంగలో తొక్కి అన్యాయం చేస్తున్నారని తెలిపారు. పెసా, 1/70, జీఓ నెం.3 లాంటి హక్కులను, చట్టాలను ఆదివాసులకు చెందకుండా పాలకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఆదివాసీ గొంతుకలపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంలో 5వ షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు బీఎస్పీ నిరంతరం పోరాడుతుందన్నారు. ఆదివాసులకు 100 శాతం ఉద్యోగాలు కల్పించే జీవో 3ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పులిని చంపారనే అనుమానంతో పశువుల కాపరులైన ఆదివాసులను నిర్బంధించి ఫారెస్ట్ అధికారులు చిత్రహింసలకు గురిచేసి జైలు పాలుచేశారని అన్నారు. పిల్లలను కూడా పోలీసులు నిర్బంధించడం విచారకరమని తెలిపారు.



ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్లుగా ఎస్టీలను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం తక్షణమే ఎన్నికలు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఏజెన్సీ ఏరియాలో ఎస్టీలకు రిజర్వ్ చేయబడ్డ జిల్లా పరిషత్ చైర్మన్ల స్థానాల్లో జనరల్ కేటగిరీకి చెందిన జెడ్పీ వైస్ చైర్మన్‌లను తాత్కాలిక చైర్మన్లుగా ప్రభుత్వం నియమించడం ఎస్టీ రాజకీయ హక్కులను కాలరాయడమే అన్నారు. ఆదివాసులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తే ఎంతటి పోరాటానికైనా బీఎస్పీ సిద్ధమని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షులు లెండుగురే శ్యామ్‌రావు, నాయకులు సోయం చిన్నన్న, సిడాం జ్యోతి, జాడి శ్యామ్‌రావు, రాజ్‌కుమార్, దుర్గం వెంకటేష్, దుర్గం శంకర్, నాగపూరే బండు, నీలాగౌడ్ పాల్గొన్నారు.



తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

తాండూరు మండలం నుండి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని వంజీరి వద్ద శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం..పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు వంజిరి గ్రామం సమీపంలో వాహనాలను తనిఖీ చేపట్టారు. సర్సిల్క్ ఏరియాకు చెందిన విరపనేని కిషోర్ మినీ వ్యాన్(టీఎస్07యూఎఫ్4369)లో తొమ్మిది క్వింటాళ్ళ రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యాన్ని, నిందితుడిని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. జిల్లాలోని వివిధ మండలాల్లో జరిగే పేకాట, కోడిపందాలు, దేశీదారు, రేషన్ బియ్యం, గంజాయి అక్రమ రవాణా వివరాలు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్‌కుమార్, పీసీలు మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

సర్పంచుల పదవీకాలం పొడిగించాలి

- సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కుంరం నాణేశ్వర్



నవతెలంగాణ-కెరమెరి

గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం ఈనెల 31న ముగుస్తున్న నేపథ్యంలో తమ పదవీ కాలాన్ని పొడిగించాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కుంరం నాణేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగంగా పలు రకాల పనులు చేపట్టినప్పటికీ నేటికీ బిల్లులు పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్నారు. సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పూర్తిస్థాయిలో చెల్లింపులు చేపట్టేంతవరకు తమ పదవీ కాలాన్ని జూన్ 31వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉపసర్పంచులకు ఉన్న జాయింట్ చెక్ పవర్ రద్దుచేసి పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంగ్వి సర్పంచ్ తొడసం జగన్నాథ్‌రావు, కేలి(బి)సర్పంచ్ ఆదే నారాయణ్, నాయకులు లెన్గూరే బాలాజీ, కుడ్మెత భీంరావు, ఆత్రం లాల్‌షావ్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలో పండ్ల పంపిణీ



నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండలంలోని అంబగట్ట గ్రామంలో పోరాటయోధుడు కుమురం భీం విగ్రహ ఆవిష్కరణ, బేహెన్‌జీ కుమారి మాయావతి జన్మదిన వేడుకల సందర్భంగా రమాబాయి మహిళ సొసైటీ ఆధ్వర్యంలో పండ్లు, నీటి పంపిణీని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు లలిత, ఉపాధ్యక్షులు కమల, ప్రధాన కార్యదర్శి, బీఎస్పీ జిల్లా లీగల్ కన్వీనర్ కిషోర్, నాయకురాలు మోర్లే శ్రీలత పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల ద్వారా నైపుణ్యాన్ని వెలికి తీయొచ్చు

నవతెలంగాణ - జైనూర్

సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విద్యార్థినుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీయొచ్చని పాములవాడ సర్పంచ్ పెందూర్ నాగోరావు అన్నారు. శనివారం సిర్పూర్(యు) మండలంలోని పాములవాడ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గ్రామం నుండి మహిళలు వచ్చి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలో 47 మంది యువతులు పాల్గొన్నారని తెలిపారు. మొదటి బహుమతి మర్సకోల సంజన, ద్వితీయ బహుమతి ఆత్రం విజయలక్ష్మి, మూడో బహుమతి ఆత్రం యశోదకు బహుకరించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌డీపీ విజయ్, గ్రామపటేల్ ధన్‌రాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలి

జైనూర్ : సిర్పూర్(యు) మండలంలోని తెలంగాణ మోడల్ పాఠశాల, కళాశాలలో ఆరో తరగతి అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మిట్ట వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ నెల 22 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ ఏడో తేదీన ఆరు నుండి పదో తరగతి వరకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, కెరమెరి ప్రాంతాల నుండి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | జనవరి 14, 2024 | www.navatelangana.com

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన దేవరకోట ఆలయ చైర్మెన్

నవతెలంగాణ-నిర్మల్



దేవరకోట దేవస్థాన ఆలయ చైర్మెన్ అమెడ శ్రీధర్ శనివారం డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావుని కలిశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వెంకటేశ్వర స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన డీసీసీ అధ్యక్షుడు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్ అయ్యన్నగారి శ్రీనివాస్, నాయకులు రఫీ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ ఎస్పీగా ఇటీవల బాధ్యతలను స్వీకరించిన గౌస్ అలంను సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఆయన కార్యాలయంలో ఎస్పీని కలసిన సభ్యులు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. అనంతరం జిల్లాకు వచ్చినకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి ఎస్పీకి సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి గేడాం మాధవ్, కోశాధికారి సూర్యకాంత్, సభ్యులు రేణికుంట రవీందర్, లోలపు శ్రీనివాస్, సతీష్ గౌరువార్, ప్రఫుల్ వార్ఖే, బండారి దేవన్న, సుభాష్ ఉరాడే పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గోదాదేవి కళ్యాణం



నవతెలంగాణ-పెంబి

మండల కేంద్రంలోని హరిహర ఆలయంలో శనివారం గోదాదేవి రంగనాథుల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీశైవ క్షత్ర వనితాశక్తి ఆధ్వర్యంలో ఒడి బియ్యాన్ని గోదాదేవి రంగనాథులకు సమర్పించారు. ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి గోదా దేవి రంగనాథుల కళ్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఈ క్రతువును తిలకించేందుకు మండలం నుంచే కాకుండా చుట్టూ పక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సల్ల రమేశ్వర్ రెడ్డి, ఆమెడ శంకర్, పార్వతల లక్ష్మీనారాయణ, గన్నరపు సురేష్, పుప్పాల నర్సయ్య, రాజలింగు, సుతరి మహేందర్, మోహన్, బచ్చు మనోహర్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కడెం : మండల కేంద్రంలోని శ్రీ సీతారామాలయంలో శనివారం గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. మండల కేంద్రంలోని మహిళలు, భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేధపండితుల వేదమంత్రోచ్చరణల నడుమ గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వికసిత్ భారత్ పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-నార్నూర్

దేశ అభివృధికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన వికసిత్ భారత్ పోస్టర్లను శనివారం మహాగావ్, గుండాల గ్రామపంచాయతీలో సర్పంచ్ రాథోడ్ వసంత్ రావ్, గ్రామ పెద్దలు శ్రీరామ్ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2047 నాటికి దేశం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు చరణ్ దాస్, శతవ్వ, వైద్య సిబ్బంది హిమబిందు, విద్యరాణీ, బ్యాంక్ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలున్నారు.

లీగ్ స్పోర్ట్స్‌కు జెడ్పీ చైర్మెన్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని కేబీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఈనెల 17 నుండి 20 వరకు నిర్వహించే ఇంటర్ సొసైటీ లీగ్ స్పోర్ట్స్ గేమ్స్ ప్రారంభోత్సవానికి జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్‌కు కమిటి సభ్యులు ఆహ్వానించారు. శనివారం ఆయన నివాసంలో కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో మేస్రం మనోహర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్, ఆత్రం భాస్కర్, ఏపీఓ పీవీటీజీ అర్క జగన్, పీఎం ఆర్‌సీఓ మరప గోవింద్ రావ్, పీఎంఆర్‌సీ సభ్యులున్నారు.

నేడు దళిత సంఘాల సమావేశం

నవతెలంగాణ-ఉట్నూర్

డివిజన్‌లోని మండల అంబేద్కర్ కమిటీలను ఏకతాటిపై తీసువచ్చే ఆశయంతో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని దళి సంఘం నాయకులు లింగంపల్లి చంద్రయ్య, బండి విజయ్ కుమార్, కాటం రమేష్, బిరుదుల లాజర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ ప్రాంతంలోని అంబేద్కర్ వాదులు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నవోదయ నగర్‌లోని బండి విజయ్ కుమార్ ఫాం హౌస్‌లో జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని తిర్పెల్లి శ్రీరామాలయం ఆవరణలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే రంగోలి కార్యక్రమానికి ఔత్సాహికులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని కోరారు. విజేతలకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. నేరుగా రామాలయానికి వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు.

ఘనంగా జ్ఞానేశ్వరి సప్త వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో వారం రోజులుగా భవ్య జ్ఞానేశ్వరి పారాయణ సప్తాహ వేడుకలు కొనసాగుతున్నాయి. శనివారం ముగింపు కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసిని రెడ్డి పాల్గొని పూజలు చేశారు. గ్రామంలో జ్ఞానేశ్వరి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి చంద్రాజీ, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- పోలీసులతో ఎస్పీ గౌస్ ఆలం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అవలంభించబోతున్నామని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. శనివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పోలీసులు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించడంతో పాటు కారణాలను విశ్లేషించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సరైన పద్ధతిలో పరిశోధన నిర్వహించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని త్వరితగతిన నేరస్తులను పట్టుకునే విధంగా తమ కార్యాచరణలను అవలంబించాలన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని, మారుమూల ప్రాంతాలలో గంజాయి పండిస్తే చర్యలు తప్పవని అవగాహనను కలించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతలు, సమస్యలపై సిబ్బందితో చర్చించారు. పోలీసు వ్యవస్థ ఉన్నతమైన వ్యవస్థని పేర్కొంటూ పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

స్టేషన్‌లలో పరిశుభ్రతను పాటించాలి..

పోలీస్ స్టేషన్‌లలో పరిశుభ్రతను పాటిస్తూ 5ఎస్ విధానాన్ని అవలంబించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలను సందర్శిస్తూ ప్రజలను సైబర్ నేరాలు, వారు అవలంబిస్తున్న నూతన విధానాలను ప్రజలకు తెలియజేస్తూ చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సీహెచ్ నాగేందర్, పోతారం శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, సీఐలు కే సత్యనారాయణ, అశోక్, సైదారావు, ప్రేమ్ కుమార్, భీమేష్, చంద్రశేఖర్, కోల నరేష్ కుమార్, కృష్ణమూర్తి, రామకృష్ణ, శ్రీనివాస్, ప్రణయ్ కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఖానాపూర్

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవడంతో పాటు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఖానాపూర్ ప్రీమియర్ లీగ్ 2024 సీజన్ 2 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు పట్టుదలతో ఆటలు ఆడితే విజయం సాధించవచ్చని తెలిపారు. ఖానాపూర్ ప్రాంత క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చుఆరు. క్రీడాకారులు క్రమశిక్షణతో పోటీలలో పాల్గొని ఈ ప్రాంత పేరును నిలబెట్టాలన్నారు. ఖానాపూర్ ప్రీమియర్ లీగ్ 2024 క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు ఆయన అభినందించారు. అనంతరం మైదానంలో తొలి మ్యాచ్ ఆడుతున్న ఇరుజట్ల క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో క్రికెట్ ఆడారు. ఇందులో కాంగ్రెస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులున్నారు.



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నూతన ఎస్పీ గౌస్ ఆలంను కలిసిన నాయకులు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న కంది శ్రీనివాస్, డీసీసీబీ చైర్మెన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నూతన ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గౌస్ ఆలంను పలువురు నాయకులు కలిసి పుష్పగుచ్చాలు అందించారు. శనివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పూలబోకే అందజేసి శాలువాతో సత్కరించారు. జిల్లాలో రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలపై ఆయనతో కొంతసేపు చర్చించారు. ఎస్పీని కలిసిన వారిలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, జైనథ్ మండల నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, బేల మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, మైనారిటీ నాయకులు ఎం.ఏ షకీల్ ఉన్నారు.

ఎస్పీని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గౌస్ ఆలంను శనివారం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు కలిశారు. క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, పలువురు నాయకులు ఎస్పీని శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లాలో యువతకు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు ఘన్‌శ్యామ్, మాజీ సర్పంచ్ రూప్‌రావు, అవినాష్, శంకర్, అవినాష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని చామన్ పల్లి, చింతల్ చందా మధ్య బ్రిడ్జిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై శ్రీకాంత్ తెలిసిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం రాజుర గ్రామానికి చెందిన జాదవ్ అంబరావు శనివారం మామడ మండలం కమల్‌కోట్ తండాకు తన బంధువుల దగ్గర ఉన్న ఎడ్లు తీసుకుపోవడానికి వచ్చాడు. ఎడ్లను ట్రాలీ ఆటోలో పంపించి తిరుగు ప్రయాణంలో తన పల్సర్ బైక్ పైన వెళ్తుండగా మార్గ మధ్యలో చామన్‌పల్లి, చింతల్ చందా మధ్య గల వాగు బ్రిడ్జిపై వెనుక నుండి వస్తున్న మరొక పల్సర్ బైక్ అతి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. అంబరావు కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన చింతల్ చందా గ్రామానికి చెందిన షేక్ అశ్వక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

దాతలు సౌకర్యాలు కల్పించడం అభినందనీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ఆస్పత్రికి దాతలు ముందుకు వచ్చి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. శనివారం రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో ఆదిత్య ఖండేష్కర్ సొసైటి, రాంగోపాల్ సంయుక్తంగా రక్తదాన చైర్లను అందించారు. సొసైటి నుంచి నాలుగు, గోపాల్ రెండు చైర్లను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ రిమ్స్‌కు సహకారం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం శుభపరిణమన్నారు. వీరిని ఆదర్శంగా మరింత మంది సహకారం అందించాలని కోరారు. హైవేకు అనుకొని ఉండడంతో ప్రమాదల సమయం, అదే విధంగా గిరిజనుల్లో రక్తహీనత సమస్యతో బాదపడే వారికి రక్తం అవసరమవుతుందన్నారు. ఇక్కడ బ్లడ్ ఇచ్చేందుకు ఆరు చైర్లను సమాకుర్చడంపై ఆయన ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, ఏకెఎస్ చైర్మెన్ ఆదిత్య ఖండేష్కర్, అనిల్ లోకండే, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పట్టణంలోని టీచర్స్ కాలనిలో గల శ్రీఅండనేశ్వర్ ఆలయంలో అంకొలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయంలో ఈనెల 15 వరకు సాగే సప్తాహ కార్యక్రమంలో మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం అధికారుల ఆదేశాల మేరకు వైద్య శిబిరం నిర్వహించి మందులను పంపిణీ చేశామని డాక్టర్ సర్ఫారాజ్ తెలిపారు. ఆలయ సిబ్బంది అన్ని విధాల సౌకర్యాలు కల్పించారని తెలిపారు. శిబిరంలో 84 మందిని పరీక్షించి మందులను అందించామని పేర్కొన్నారు. సప్తాహ కొనసాగే వరకు వైద్య శిబిరాన్ని నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరులు బొమ్మెత సుభాష్, ఆడే సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ బత్తుల సౌజన్య, ఆరోగ్య డి.మమత, రాథోడ్ నారాయణ, ఆశా కార్యకర్తలు సురేఖ, జ్యోతి, నాసిక్, భావన, ప్రియా పాల్గొన్నారు.



సామాన్యుడిగా హోటల్‌లో ఎమ్మెల్యే భోజనం



నవతెలంగాణ-ఉట్నూర్

సామాన్యుడిల ఓ హోటల్‌లో భోజనం చేస్తు అందరిని దృష్టిని ఆకర్షించారు ఆ ఎమ్మెల్యే. ఆయన ఓ గిరిజన ప్రాంత నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయిన ఎలాంటి అర్భాటలకు వెళ్లకుండా సీదాసాదాగా జీవనం సాగిస్తున్నారు. ఆయన ఎవరో కాదు ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు. శనివారం మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో టిఫిన్ చేశారు. హోటల్‌కు వచ్చిన ప్రజలతో పాటు యాజమన్యంతో కాసేపు ముచ్చటించారు. అనంతరం హోటల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేగా ఉన్న కూడా ఆయన సామాన్యుడిలా జనంలో తిరగడం పట్ల పలువురు ఆయనను అభినందిస్తున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఏఎస్సై



నవతెలంగాణ-కడెం

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఏఎస్సై భీంరావు అన్నారు. శనివారం మండలంలోని అంబారిపేట్ గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను అంబారిపేట్ సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉంటు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడాలతో శరీర ధృఢతత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండవేణి ఎల్లయ్య, సీసీ మల్యాల స్వామి, రేషన్ డీలర్ ప్రసాద్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బైరి రవి, నల్గొండ సత్తన్న, నరేష్, గంగన్న, అంజన్న, భూమన్న పాల్గొన్నారు.

ఆటలతో స్నేహభావం పెరుగుతుంది : ఎమ్మెల్యే



నవతెలంగాణ-బోథ్

ఆటలతో గ్రామీణ ప్రాంతాల యువకుల మధ్య స్నేహ భావం పెరుగుతుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని పోచ్చర గ్రామంలో మద్దెల అనిల్ కుమార్ స్మారక క్రికెట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా అనిల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తాలూకా స్థాయి క్రికెట్ పోటీలలో ఆయా గ్రామాల నుంచి పోటీలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను పరిచాయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కాసేపు వారితో క్రికెట్ ఆడి ఉత్సహపరిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాలతో పాటు చదువుల్లో రాణించాలన్నారు. తాలుకా స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడి ప్రతిభను చాటాలన్నారు. ఆటల్లో గెలుపోటముంటాయని, వాటిని సమానంగా తీసుకోవాలన్నారు. ఓటమి గెలుపుకు తొలిమెట్టు అన్న సామెతను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూరుగు మల్లేష్, మాజీ సర్పంచ్ దివాకర్ రెడ్డి, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం ప్రమాదం

నవ తెలంగాణ-తలమడుగు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ప్రమాదం జరిగిన సురక్షితంగా ఉంటుందని ఏఎస్సై సురేందర్ తెలిపారు. శనివారం మండలంలోని అంతరాష్ట్ర రహదారిపై ద్విచక్ర వాహనదారులతో పాటు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రయోజనలు, లేక పోతే జరిగే నష్టలను వివరించారు. ప్రతి వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపడంతో పాటు పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు వెంట ఉంచుకోవాలని సూచించారు. నిరంతరం ప్రజల కోసమే సేవలు చేస్తూ శాంతి భద్రతలు కాపాడడమే పోలీస్ శాఖ ధేయమని తెలిపారు. ప్రమాదంలో ప్రాణాలు పోతే బాదిత కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. పోలీసుల సూచనలు పాటించి సురక్షిత ప్రయాణం చేస్తు ఇండ్లకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు ప్రభాకర్, మధుకర్, రార్‌రెడ్డి, గంగన్న ఉన్నారు.

కుటుంబాలను పరామర్శించిన నాయకులు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో బరంపూర్, పెండలవాడ, అర్లి-కే గ్రామాలకు చెందిన పలువురు మరణించగా వారి కుటుంబాలను జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఆయా పార్టీల నాయకులు శనివారం పరామర్శించారు. బరంపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది మేకల మధుకర్ సోదరుడు రవీందర్ మరణించగా, పెండల్ వాడ గ్రామానికి చెందిన సుగ్యం విట్టల్ అల్లుడు గుండెపోటుతో మరణించగా, అర్లి-కే గ్రామానికి చెందిన కంది నర్సరెడ్డి మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. బరంపూర్ గ్రామానికి చెందిన బొల్లరపు వామన్ కూతురు ఆనారోగ్యంతో బాధపడడంతో ఆస్పత్రుల ఖర్చులకు రూ.5వేలు సాయం చేశారు. ఇందులో కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, మాజీ జెడ్పిటిసి బొల్లారం బాబన్న, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు మేకల మల్లన్న, ఎంపీటీసీలు వెంకన్న, రమేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తిరుపతి, ఎస్సీ సెల్ అధ్యక్షులు అశోక్, వెంకటేష్, గాజుల సాంబశివ్, సళ్ళ దేవన్న, రాకేష్, గంగన్న ఉన్నారు.

కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలం వెంకట్రావుపేట గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన కబడ్డీ టోర్నమెంట్ను మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి టోర్నమెంట్ వల్ల యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు తోడ్పడుతాయని అన్నారు. క్రీడాకారులు అందరూ క్రమ శిక్షణతో ఉంటూ అంకిత భావంతో క్రీడల్లో రాణించాలని పేర్కొన్నారు. ఈ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేసిన అందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మండల యూత్ అధ్యక్షులు గంగాధర్, గ్రామ సర్పంచ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు ఉచిత మందుల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కిస్టాపూర్ లింగయ్య పల్లె గ్రామాలకు చెందిన 18 మంది యాదవులకు రెండవ విడతలో గొర్రెల పంపిణీ చేయగా వారికి శనివారం మండల పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్, యాదవ్ సంఘ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ చలికాలంలో గొర్రెలకు వచ్చే వ్యాధులపై యాదవులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లింగయ్య పల్లె సొసైటీ అధ్యక్షుడు పిండి నరేష్ యాదవ్ కిస్టాపూర్ సొసైటీ అధ్యక్షుడు గట్టు మహేష్ యాదవ్ యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కామాన్పల్లి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నూతన కార్యవర్గాన్ని శనివారం గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జునుగురు నాగరాజు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు కోడిజుట్టు నరేష్, ఉపాధ్యక్షులు పంచర్పుల మల్లేష్, ప్రధాన కార్యదర్శి జాడి కిరణ్, క్యాషియర్ సాట్ల సత్యం, అకౌంటెంట్ కొలిమికుంట్ల రమణాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి రమేష్, కార్యదర్శి వంగాల శేఖర్, ముఖ్య సలహాదారులు చాట్ల తిరుపతి, జరుగురు వెంకటేష్, బోర్లకుంట వెంకటేష్ ప్రచార కార్యదర్శులు జునుగురు రామన్న, జాడి భాస్కర్, కత్తిరిపాక రాజేష్, సలహాదారులు కేతనేని చిలకలయ్య, బుఖ్య శ్రీనివాస్, దుర్గం శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విదేశాలలో కష్టపడుతున్న గల్ఫ్ కార్మికులను ప్రభుత్వం గుర్తించి వారికి అండగా నిల్వాలని స్థానికంగా ఉన్న గల్ఫ్ కార్మికులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గల్ఫ్ సంక్షేమ సమితి కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రామాలయంలో అయ్యప్ప స్వాములకు(బిక్ష) అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రామకృష్ణాపూర్ ముస్లిం మైనార్టీ సోదరుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా ఈ సంవత్సరం కూడా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉన్నదని అన్నారు. దీక్ష చేపట్టిన స్వాములు తమ యొక్క శబరి యాత్ర సంతోషంగా సాగాలని కోరారు. అనంతరం అయ్యప్పస్వాములు ముస్లిం సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, నజీరోద్దీన్, ఖాజా, షఫీ, పాషా, గౌస్, మేరజ్, అంకుష్, ఇమామ్, పట్టణ ఎస్సై జి రాజశేఖర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యం



నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రటరీ వీరభద్రయ్య అన్నారు. శనివారం ఆర్కే-7 గనిలో ఎస్ఎల్ పి(సర్వీస్ లింక్డ్ ప్రమోషన్స్) పొందిన కార్మికులకు గని మేనేజర్ సాయిప్రసాద్‌తో కలిసి ఉద్యోగోన్నతి పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణి గుర్తింపు ఎన్నికలలో అధిక మెజార్టీతో ఏఐటీయూసీని గెలిపించినందుకు కార్మికులకు రావలసిన అన్ని రకాల బెనిఫిట్స్, హక్కులు సాధించడానికి ఏఐటీయూసీ ఎప్పుడు కూడా ముందుండి యాజమాన్యంతో పోరాటం చేస్తుందని, కార్మికులకు ఏ ఇబ్బంది వచ్చినా ఏఐటీయూసీ అండగా ఉంటుందని, సింగరేణిలో పనిచేస్తూ ఏడు సంవత్సరాలు అండర్ గ్రౌండ్ మైన్‌లో పనిచేస్తూ సర్వీస్ లింక్డ్ ప్రమోషన్స్ పొందిన కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి భూగర్భంలో పనిచేస్తూ ఉత్పత్తిని పెంచడానికి కార్మికులు ప్రాణాలను పనంగా పెట్టి సింగరేణిని దేశంలో అగ్రస్థానంలో నింపడానికి కృషి చేస్తున్నారని, మేనేజ్మెంట్ కూడా కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని, సంస్థను కాపాడడానికి అధికారులు కూడా కషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు కిషన్ రావు, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నేరిమట్ల మల్లేష్, ఏరియా సెక్రెటరీ మారేపల్లి సారయ్య, పిట్ సెక్రెటరీ బేర రవీందర్ పాల్గొన్నారు.

'రక్తదానం అంటే ప్రాణాలను కాపాడటమే'

నవతెలంగాణ-నస్పూర్

రక్తదానం చేయడం అంటే ఒకరి ప్రాణాలను కాపాడటమేనని నస్పూర్ మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ సురిమిల్ల వేణు అన్నారు. శనివారం మున్సిపాలిటీ 20వార్డు సీతారాంపల్లికి చెందిన టీం యూనిటీ యువత అధర్వంలో తలసేమియా వ్యాధి గ్రస్తుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక వార్డ్ కౌన్సిలర్ సురిమిళ్ళ వేణు, సహకార సంఘం డైరెక్టర్ ధరణి మధుకర్ పాల్గొని మాట్లాడారు. టీం యూనిటీ యువత ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమని అన్నారు. ఈ శిబిరంలో దాదాపు 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరం విజయవంతానికి కృషి చేసిన రెడ్ క్రాస్ సొసైటీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పొనగంటి రంగారావు, మూదం దేవయ్య, కొక్కిరాల మోహన్ రావు, దెబ్బటి వెంకన్న పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పతకాలు సాధించిన ఆదర్శ విద్యార్థులు

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. నెట్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్వర్ణ, కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో అండర్-17 విభాగంలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎర్ర వినీల్ జాతీయ స్థాయి స్వర్ణం, అండర్-19 విభాగంలో ఇంటర్ విద్యార్థులు డి.అంజన్న, యం.అభిసాయి నెట్ బాల్ ఫాస్ట్ 5 విభాగంలో కాంస్య పతకం సాధించారన్నారు. అదే విధంగా సీనియర్ బాలికల విభాగంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దియా సర్కార్, ఫాస్ట్ 5 విభాగంలో గోలెం హర్షిత, ఏ.వైష్ణవి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు.

గనులపై భద్రత కరువు..!

- పాత కాలం చెక్క, ఇనుప పెట్టెలే
- సాంకేతికత పెరిగినా పాత విధానమే
- చోరీకి గురవుతున్న వస్తువులు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికులు డ్యూటీలో వేసుకునే బట్టలు, బూట్లు, టోపీ, ఇతర సామాగ్రి దాచుకునేందుకు యాజమాన్యం టూల్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ వాటిని అందుబాటులోకి తీసుకురాకపోవడంతో కార్మికులు తామే ప్రత్యేకంగా చెక్క పెట్టెలను తయారు చేయించుకుంటున్నారు. అయితే తమ వెంట తెచ్చుకున్న సామాగ్రిని బద్ర పరుచుకునేందుకు గనుల వద్ద సరైన సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. యాజమాన్యం సేఫ్టీ లాకర్లు ఏర్పాటు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్న పట్టించుకోవడం లేదు. దీంతో వారి వస్తువులకు రక్షణ లేకుండా పోతోంది. ఇటీవల పాతకాలపు చెక్క, ఇనుప పెట్టెలో బద్రపర్చుకున్న వస్తువులు చోరీకి గురయ్యాయి.

నేటికీ పాత కర్ర, ఇనుప పెట్టెలే దిక్కు...

గతంలో కార్మికులు వారి బట్టలు, విలువైన సామాగ్రిని తమకు తెలిసిన వారికి ఇచ్చి వెళ్లేవారు. క్రమంగా సొంత డబ్బులతో కర్ర, ఇన్నోపెట్టలను కొనుక్కొని వాటిలో భద్రపరుచుకునేవారు. అలా దాచుకున్నప్పటికీ సరైన భద్రత ఉండడం లేదు. కొన్ని సందార్భఆల్లో కార్మికుల విలువైన వస్తువులు కూడా పోయిన సందర్భాలు ఉన్నాయి. మరి కొన్ని సందర్భాల్లో కార్మికులు తయారుచేసుకున్న పెట్టెల నుంచి విషపురుగులు కూడా రావడం వలన ఆందోళనకు గురయ్యేవారు. ఈ నెల ఆరవ తేదీ రాత్రి బదిలీలో ఏకంగా 40 పెట్టెలు పగలగొట్టి విలువైన సెల్ ఫోన్లను, కొంత నగదును ఎత్తుకెళ్లడం గమనార్హం.

ఎక్కడపడితే అక్కడ దుస్తులు, బూట్లు

ఇప్పటికీ కార్మికులకు సరైన విధంగా రెస్ట్ రూములు లేకపోవడంతో ఉన్న గదిలోనే కార్మికులంతా తమవస్తులను భద్రపరచడానికి సరైన స్థలం లేక రేకుల షెడ్డులో బూట్లకు తాళం వేసుకోవాల్సి వస్తుంది. సరైన విధంగా బూట్లు, దుస్తులను భద్రపరచుకునే పరిస్థితి లేకపోవడంతో అవి త్వరగా పాడైపోతున్నాయని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆచరణలో కనిపించని సంక్షేమం

సింగరేణి యాజమాన్యం కార్మికులకు అనేక సంక్షేమ కార్యక్రమాల పేరిట ఖర్చు పెడుతోంది. అంతేకాకుండా వివిధ అభివృద్ధి కార్యక్రమాల పేరిట నిధులను మంజూరు చేస్తూ అభివృద్ధిలో పాలుపంచుకుంటుంది. అయితే గనులపై కార్మికులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం వివక్ష చూపుతుందని కార్మికులు అంటున్నారు. యాజమాన్యమే లాకర్లు అందజేస్తామని చెప్పి ఏర్పాటు చేయకపోవడంపై పెదవి విరుస్తున్నారు. గతంలో సేఫ్టీ లాకర్లకు టెండర్లు పిలిచినా పలు కారణాలతో నిలిపివేశారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట అంటూనే నిర్లక్ష్యం

గుల్ల బాలాజీ, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ అధ్యక్షుడు



యాజమాన్యం కార్మికుల సంక్షేమంపై అనేక చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న ఆచరణలో అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కార్మికుల దుస్తులు, విలువైన సామాగ్రి భద్రపరుచుకునేందుకు సేఫ్టీ లాకర్లు ఏర్పాటు చేయడంలో యాజమాన్యం అలసత్వం వహించడం భావ్యం కాదు. యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించిసేఫ్టీ లాకర్లను ఏర్పాటు చేయాలి.

కార్మికుల సంక్షేమానికి వెనుకడుగు వేసేది లేదు

- సింగరేణి సీఎండీ బలరాం నాయక్



నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల సంక్షేమానికి వెనుకడుగు వేసేది లేదని సింగరేణి చైర్మన్ అండ్ డైరెక్టర్ బలరాం నాయక్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ డిస్పెన్సరీలో రూ.33 లక్షల వ్యయంతో అధునాతనమైన ఎక్రే యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ తోడ్పాటును అందిస్తానని తెలిపారు. సింగరేణి ఏరియాలలో మంచినీటి సరఫరా కోసం నిరంతరం కృషి చేస్తానని, అందులో భాగంగానే శ్రీరాంపూర్ ఏరియాలో ఈ నెలాఖరులో 16 కోట్లతో గ్రావిటీ ఫిల్టర్‌లను ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రక్షణ, ఉత్పత్తి, రవాణా, ఓబి విషయంలో నిర్లక్ష్యం లేకుండా వ్యవహరించాలని అన్నారు. కార్మికుల ఆరోగ్య దృష్ట్యా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్, హనుమంతరావు ఐ ఆర్ అండ్ పీఎం, ఏఐటీయూసీ యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనప్రసాద్, ఎస్ ఓ టు జీఎం రఘు కుమార్ పాల్గొన్నారు.



కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

కబడ్డీ టోర్నమెంట్ విజేత, రన్నర్ జట్ల క్రీడాకారులకు ట్రోఫీ, క్యాష్ ప్రైజ్‌ను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అందజేశారు. శనివారం లక్షెట్టిపేట పట్టణంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన దినోత్సవం, సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రారంభించారు. కబడ్డీ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ బజరంగ్ జట్టు, మహదేవ్ జట్టు మధ్య జరగిన ఫైనల్ మ్యాచ్‌లో బజరంగ్ జట్టు ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు,, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి విజేతలకు ఛాంపియన్ ట్రోఫీ, రూ.10 వేల క్యాష్ ప్రైజ్, రన్నరప్‌గా నిలిచిన మహదేవ్ జట్టుకు ట్రోఫీ, రూ.5 వేల క్యాష్ ప్రైజ్ అందజేశారు.

ఉత్సాహభరితంగా సైకిల్ రేస్ పోటీలు

- హాజీపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు భారీ స్పందన



నవతెలంగాణ-హాజీపూర్

హాజీపూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల సైకిల్ రేస్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. శనివారం మండలంలోని బుగ్గగట్టు వద్ద ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన సైకిల్ రేస్ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 150 మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు. మొదట హాజీపూర్ ఎస్సై నరేష్‌తో పాటు ప్రజాప్రతినిధులు జెండా ఊపి పోటీలు ప్రారబించారు. 5 విభాగాల్లో జరిగిన పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేల సంఖ్యలో వీక్షకులు రావడంతో గ్రౌండ్ కిక్కిరిసి పోయింది. ప్రతి విభాగంలో మొదటి బహుమతి షీల్డ్ తోపాటు రూ .2వేల నగదు, రెండవ బహుమతి షీల్డ్‌తో పాటు రూ.వెయ్యి అందజేశారు. ఒకటి రెండవ తరగతుల విభాగంలో మొదటి బహుమతి కొత్తపల్లి ఆశిష్, రెండవ బహుమతి ఎనగందుల విశాల్‌లు గెలుపొందారు. 3,4 వ తరగతుల విభాగంలో మొదటి బహుమతి జేబీ అద్నాన్, రెండో బహుమతి స్నేహిత్‌లు గెలుపొందారు. 5,6 తరగతుల విభాగంలో గోపూ చరణ్ కుమార్ మొదటి, రెండవ బహుమతి తిప్పని రాంఅఖిల్ లు గెలుపొందారు. 7,8 వ తరగతుల విభాగంలో మొదటి బహుమతి గోపు మహేష్, రెండవ బహుమతి రిషిలు గెలుపొందారు. 9,10 వ తరగతుల విభాగంలో మెంద్రపు శివ చరణ్ మొదటి స్థానం, గెల్లు సిద్దులు రెండవ బహుమతి గెలుపొందారు. 7,8 వతరగతి విభాగంలో ఫైనల్ రేస్‌లో ఇద్దరు ఒకే సారి రీచ్ కావడంతో ఉత్కంఠకు దారి తీసింది. వీడియో ఫుటేజ్ ఆధారంగా ఎంపైర్‌లు విజేతను ప్రకటించారు. పోటీల్లో పాల్గొన్న వారికి భహుమతులు అందించిన వారిలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్, జడ్పీటీసీ పుస్కూరి శిల్పా శ్రీనివాస్ రావు, గుడిపేట సర్పంచ్ లగిశెట్టి లక్ష్మీ రాజయ్య, కందుల రమేష్, శ్రీనివాస్ గౌడ్, బేర పోచయ్య, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, అత్తె శ్రీనివాస్‌లు స్పాన్సర్లుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి, బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, సీపీఐ మండల కార్యదర్శి దేవి పోచన్న, ముడిమడుగుల శ్రీనివాస్, మట్టపల్లి సత్యనారాయణ, ఏ ఎస్సై చాంద్ పాషా, దొమ్మటి లచ్చన్న పాల్గొన్నారు.



విజేతలతో నాయకులు, నిర్వాహకులు

పొన్కల్ పీఏసీఎస్ చైర్మన్ అవిశ్వాసంపై హైకోర్టు స్టే



నవతెలంగాణ-జన్నారం

తనపై కొంత మంది డైరెక్టర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మాణంపై హైకోర్టు స్టే మంజూరు చేసిందని మండలంలోని పొన్కల్ సహకార సంఘం చైర్మన్ శీలం రమేష్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 6న తనపై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టాలని కొందరు డైరెక్టర్లు జిల్లా ఇన్‌ఛార్జి డీసీఓతో పాటు హైదరాబాద్‌లోని కోఆపరేటివ్ స్టేట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేయడంతో వారు తనకు అవిశ్వాసం ఎదుర్కోవాలని నోటీసులు జారీ చేశారని తెలిపారు. దీనిపై హై కోర్టుకు వెళ్లడంతో స్టే మంజూరు చేసిందని తన 3 సంవత్సరాల పదవి కాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులు అందజేయడం జరిగిందని ఎప్పటికైన న్యాయమే గెలుస్తుందని తనకు సరిపడ డైరెక్టర్ల మద్దతు ఉందని ఆయన దీమ వ్యక్తం చేశారు. రైతులకు అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటూ సకాలంలో ఎరువులు విత్తనాలు అందజేశామన్నారు. న్యాయం తమవైపు ఉందన్నారు

మల్కేపల్లిలో ఉచిత విద్యుత్ పథకం ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మల్కేపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం కోలం, తోటి గిరిజనులకు ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద ఉచిత విద్యుత్ పథకాన్ని విద్యుత్ శాఖ ఏఈ శేషరావు, డీఈ రాజన్న ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పీవీటీజీ పథకం కింద మీటర్, సర్వీస్ వైర్ ఏర్పాటుతో పాటు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్, ఏఈ స్వర్ణలత, విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముత్యంపల్లిలో యువకుల శ్రమదానం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి గ్రామపంచాయతీ పల్లె ప్రకృతి వనంలో గ్రామ యువకులు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ప్రకృతి వనంలో మొక్కలు, చెట్లకు నీటి ఎద్దడిని తీర్చలరని, పార్కు, గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని యువకులు పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన జూనియర్ అసిస్టెంట్లకు విధులు కల్పించాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో ఎక్స్‌టర్నల్ నియామకం ద్వారా నియమించిన 146 మంది జూనియర్ అసిస్టెంట్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మాల్రాజ్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు శనివారం గోలేటిలోని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ల కోసం పరీక్షలు నిర్వహించి వారికి వివిధ ఏరియాలలో పోస్టింగ్ ఇచ్చారన్నారు. పోస్టింగ్ తీసుకుని ఉద్యోగంలో చేరిన రెండవ రోజు మీరు సింగరేణి ఎలక్షన్ తర్వాత డ్యూటీలోకి రావాలి అప్పటిదాకా ఆగాలి అని సింగరేణి యాజమాన్యం చెప్పిందన్నారు. ఎన్నికలు జరిగి రెండు వారాలు గడుస్తున్న వారిని విధులలోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే వారిని విధులలోకి తీసుకోవాలని, కొత్తవారిని నియమించిన క్రమంలో సీనియర్ క్లరికల్‌కు వివిధ ఏరియాలకు కౌన్సిలింగ్ ద్వారా అవకాశం కల్పించామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు ధరావత్ మంగీలాల్, మాజీ వైస్ ప్రెసిడెంట్ నల్లగొండ సదాశివ్, ఏరియా నాయకులు గజెల్లి చంద్రశేఖర్, కోగిలాల రవీందర్, మారిన వెంకటేష్ పాల్గొన్నారు

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సంతాపం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ పద్మశాలి సంఘం వ్యవస్తాపకులు రామ శ్రీనివాస్, తెలంగాణ ప్రాంత సంఘం అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ రావు ఇరువురు ఇటీవల కాలంలో మరణించారు. వీరి అకాల మరణం పట్ల జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సంఘ భవనంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షురాలు మంచికట్ల అశమ్మ, తాలూకా అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్, పోపా అధ్యక్షుడు బేత రమేష్, మండల అధ్యక్షుడు అనుముల ఉషన్న, నాయకులు ఉన్నారు.